

రెండుచోట్ల పాల్గొంటా



బతుకమ్మ పండుగంటే పూల పండుగ. పండుగ వరకు చేలల్లో ఎటుచూసినా బంతిపూలు, పట్టకుచ్చులు, తంగేడు పూలు కనిపిస్తాయి. అత్తగారింటి వద్ద తొమ్మిది రోజులకు సద్దుల బతుకమ్మ పండుగ జరగ్గా, పుట్టిల్లు కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో దసరా తర్వాత రెండు రోజులకు సద్దుల బతుకమ్మ నిర్వహించుకుంటారు. రెండు గ్రామాల్లో జరిగే సద్దుల బతుకమ్మ పండుగలో పాల్గొంటా. – ఏనుగు లత, బండపల్లి, చందుర్తి

ఆడపడుచులకు అతి పెద్ద పండుగ



ఆడపడుచులకు బతుకమ్మ అతి పెద్ద పండుగ. బతుకమ్మ పండుగ వస్తే గ్రామంలో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులంతా ఒకచోట చేరి బతుకమ్మ ఆడుకునే అవకాశం వస్తుంది. అందరూ కలిస్తే ఆ సంబరమే వేరు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ పండుగ తొమ్మిది రోజులకు సద్దుల బతుకమ్మతో ముగిసిపోతుంది. – కొడగంటి తేజస్విని, మల్యాల, చందుర్తి

వాయినాలు ఇచ్చుకోవడం సంప్రదాయం



బతుకమ్మ పండుగ పర్వదినాల్లో సహజ సిద్ధమైన పిండి వంటలతో వాయినాలు ఇచ్చుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ప్రకృతి ఒడిలో లభించే రకరకాల పూలతో తొమ్మిది రోజులు బతుకమ్మలను తీర్చిదిద్దడం, ఇంటిల్లిపాది కలిసి ఆడుకోవడం ఆనందంగా ఉంటుంది. బతుకమ్మ పండుగ మహిళలకు మరపురాని మధురానుభూతిని కలిగిస్తుంది. – లక్కిరెడ్డి విద్య, గంభీరావుపేట

క్లుప్తంగా

డిజిటల్ లైబ్రరీ మంజూరు చేయండి

సిరిసిల్లకల్చరల్: జిల్లా న్యాయవాదుల సౌకర్యం కోసం డిజిటల్ లైబ్రరీ మంజూరు చేయించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను జిల్లా న్యాయవాదుల సంఘం కోరింది. శనివారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయ ప్రాంగణంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్నట్లుగానే జిల్లాలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తే న్యాయవాదులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. జనవరిలోపు డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు న్యాయవాదుల సంఘం గ్రంథాలయ కార్యదర్శి ఉచ్చిడి శరత్‌రెడ్డి, మల్లారపు సంతోష్‌రెడ్డి, సురేశ్ పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయండి

ఎల్లారెడ్డిపేట: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంగనర్‌లో శనివారం బీజేపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాచర్లగొల్లపల్లిలోని యాదవ సంఘం కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి ఎంపీ నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు దేవయ్య, ఉన్నారు.

సీసీఆర్‌టీ సర్టిఫికెట్ అందుకున్న ఉపాధ్యాయురాలు



సీసీఆర్‌టీ డైరెక్టర్ చేతుల మీదుగా ట్రైనింగ్ సర్టిఫికెట్ అందుకుంటున్న స్వరాజ్యలక్ష్మి

చందుర్తి: సెంట్రల్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రెయినింగ్ (సీసీఆర్టీ) డైరెక్టర్ రాజీవ్‌కుమార్ చేతుల మీదగా చందుర్తి మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రామగిరి స్వరాజ్యలక్ష్మి ట్రెయినింగ్ సర్టిఫికెట్‌ను శనివారం ఢిల్లీలో అందుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి స్వరాజ్యలక్ష్మికి ఆహ్వానం అందింది. ఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. మండల విద్యాధికారి వినయ్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ అభినందనలు తెలిపారు.

వేములవాడ రూరల్ ఎస్సైగా వెంకట్రాజం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల ఎస్సైగా వెంకట్రాజం శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన అంజయ్య సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో వేములవాడ పట్టణ ఎస్సైగా పనిచేస్తున్న వెంకట్రాజంను వేములవాడ రూరల్ ఎస్సైగా బదిలీపై రాగా బాధ్యతలు చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరిక



కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల, నిమ్మపల్లి, మర్తనపేట గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మరిమడ్లకు చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుంపెట రాజేశం, మందరెడ్డి, నిమ్మపల్లికి చెందిన పారెల్లి రాజు, మర్తనపేటకు చెందిన ముదాం ప్రవీణ్, నీరటి స్టీఫెన్, గుర్రం నవీన్‌లతో పాటు నిజామాబాద్, మర్తనపేట గ్రామాలకు చెందిన 30 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చేపూరి గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్ నర్సయ్య, తదితరులు ఉన్నారు.

మంత్రి కృష్ణారావును సన్మానించిన కళాకారులు

సిరిసిల్లటౌన్: తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో జిల్లా కళాకారులు రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గద్దర్ వెన్నెలక్కలను సన్మానించారు. శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించారు. జిల్లా కళాకారులు ఎడమల శ్రీధర్‌రెడ్డి, గుగ్గిళ్ల పరుశరాములు, శ్రీరాముల రామచంద్రం పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ఖరారు

ముస్తాబాద్: మండలంలో వార్డు స్థానాలకు రిజర్వేషన్లను శనివారం ఖరారు చేశారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలకు గాను 202 వార్డు స్థానాలున్నాయి. ఈ మేరకు జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు కేటాయిస్తూ డ్రా పద్ధతిన రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. బీఆర్ఎస్, బీఎస్పీ, సీపీఐ వివిధ పార్టీల బాధ్యుల సమక్షంలో రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టామన్నారు. 50 శాతం వార్డు స్థానాలను మహిళా అభ్యర్థులకు కేటాయిస్తూ రిజర్వేషన్ల డ్రాను తీసినట్లు తెలిపారు. ఎంపీవో వాజీద్, సూపరిండెంటెంట్ వినోద్, వివిధ పార్టీల నాయకులు బొంపెల్లి సురేందర్‌రావు, చాకలి రమేశ్, గీస భిక్షపతి, సుద్దాల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- ముస్తాబైన శ్రీశాల క్షేత్రం
- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
- అక్టోబర్ 3న కల్యాణం, 7న రథోత్సవం

పూర్వకాలంలో తిరుపతి వెళ్లలేని భక్తులు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి తిరుమల దర్శనం చేసుకుంటే వచ్చే పుణ్యాన్ని పొందేవారు. అందుకే ఇక్కడ కూడా దేవ దేవునికి పన్నెండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం వందల ఏళ్లుగా వస్తుంది. సోమవారం నుంచి శ్రీశాల క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.. – సిరిసిల్ల టౌన్



వేంకటేశ్వర స్వామివారు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

ఏటా లక్షమందికి పైగా

భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వేంకటేశ్వరస్వామి క్షేత్రం వెలుగొందుతోంది. ఏటా జరిగే సప్తగిరీశుని ఆలయ బ్రహ్మోత్సవాల మాదిరిగానే ఇక్కడ నిర్వహిస్తారు. ఏటా సుమారు లక్షమందికి పైగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 8 వరకు పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.

శ్రీశాల క్షేత్ర ప్రాశస్త్యం

సుమారు 800 ఏళ్ల క్రితమే శ్రీశాల క్షేత్రంలో కేశవనాథుని ఆలయం నిర్మితమైందని పురాణాలు చెబుతున్నాయి. కాకతీయుల కాలంలో మొగలాయిలు హిందూ ఆలయాలపై విధ్వంసాలు జరుపుతూ ఇక్కడి మూలవిరాట్టును పగులగొట్టారు. ఆ విగ్రహం ఇప్పటికీ ఆలయంలోని వాహనశాలలో భద్రంగా ఉంది. కొన్నేళ్లకు సిరిసిల్లను పాలిస్తున్న సర్‌దేశాయ్ చెన్నమనేని వంశస్తులు తుక్కారావు, మీనారావుకు స్వామివారు కనిపించి మాండవ్య మహానది (మానేరు) ప్రాంతంలో బర్రెంకల చెట్టు కింద ఉన్న విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించాలని చెప్పి అంతర్ధానమయ్యారు. దేశాయ్‌లు ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి వాహనాలు, పొన్నసేవ, రథాన్ని చేయించారు. అప్పటినుంచి సిరిసిల్లలో ఏళ్లుగా బహ్మోత్సవాలు జరుగుతున్నాయి. బర్రెంకల వృక్షం కింద స్వామి స్వయంభూగా ఉద్భవించడంతో ఈక్షేత్రం బర్రెంకల వెంకటేశ్వరస్వామి ఆలయంగా వర్ధిల్లుతుంది. ఇక్కడి స్వామివారి రథం తెలంగాణ జిల్లాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పెద్దదిగా పేరొందింది.

బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు..

వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 9గంటలకు స్వపన తిరుమంజనం (పులికాపు)తో మొదలై అక్టోబర్ 8 రాత్రి ఏకాంతసేవతో ముగుస్తాయి. ఆలయ అధికారులు, అర్చకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సెప్టెంబర్ 29న పులికాపు, పుణ్యవచనం, 30న అంకురారోపణం, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, శేషవాహనం, అక్టోబర్ 1న ఆరాధన, బాలభోగం, ధ్వజ కుంభారాధన, హంస వాహనం, 2న సింహవాహనం, అశ్వవాహనం(దసరా)వేడుకలు, 3న శ్రీవారి కల్యాణోత్సవం, గరుడ వాహనం, హన్మంతవాహనం, 4న సూర్యప్రభ వాహనం, రంగనాయక తిరుప్పోళం, చంద్రవాహనం, 5న అండాళమ్మవారికి ఒడిబియ్యం, గజవాహనంపై శ్రీవారి ఊరేగింపు, 6న బలిహరణం, నిత్య హోమం, కాళింగమర్ధనం, పొన్నరథంపై శ్రీవారి ఊరేగింపు (పొన్నవాహనం), 07న శ్రీవారి రథోత్సవం, రథంపై దర్శనం, అనంతరం తిరువీధుల్లో రథోత్సవం, అశ్వవాహనంపై దోపుకథ, 8న హోమం, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, నాగబలి, దేవతా ఉద్వాసన, గ్రామబలి, ఏకాంతసేవ కార్యక్రమాలు జరుగుతాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం



బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి దర్శనానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు వసతులు కల్పించాం. తిరుమల తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాల మాదిరిగా ఇక్కడ కూడా ఉత్సవాలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. అన్నిశాఖల అధికారులు సహకరిస్తున్నారు. ఉత్సవాల రోజుల్లో ప్రత్యేకంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – మారుతిరావు, ఆలయ ఈవో

సద్దుల బతుకమ్మ సంబరం



వేములవాడ అర్బన్ : అనుపురంలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు



సిరిసిల్ల : పట్టణంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కోణార్క్ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది



వేములవాడరూరల్ : వట్టెంలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిరిసిల్ల టౌన్ : ఆస్ట్రేలియాలో బతుకమ్మ సంబరాలు



బోయినపల్లి: వరదవెల్లిలో



సిరిసిల్ల టౌన్ : బతుకమ్మ వేడుకల్లో మహిళలు



ఇల్లంతకుంట: వెంకట్రావుపల్లిలో..



సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల సహస్ర కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని శాత్రాజుపల్లి, కోనాయపల్లి, రూరల్ మండలం వట్టెంల గ్రామంతో పాటు విలీన గ్రామాల్లో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బతుకమ్మలను ప్రధాన కూడళ్ల ఉంచి ఆడిపాడారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

వేములవాడఅర్బన్: అనుపురం, తిప్పాపూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని మాన్వాడ, వరదవెల్లి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో ఆడిపాడారు. అనంతరం చెరువు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

ఇల్లంతకుంట: మండలంలోని వెంకట్రావుపల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అనంతరం బిక్కవాగు వద్ద నిమజ్జనం చేశారు.

సిరిసిల్ల: తెలంగాణ మహిళల ఆత్మీయ పండుగ బతుకమ్మ పండగ జిల్లా కేంద్రంలో ఆనందోత్సాహాల మధ్య సాగింది. సిరిసిల్లలోని కోణార్క్ హాస్పిటల్ ఆవరణలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది బతుకమ్మ ఆడిపాడారు. నిత్యం విధుల్లో బిజీగా ఉండే డాక్టర్లు, సిబ్బంది అన్నీ మరిచిపోయి ఉల్లాసంగా గడిపారు. వైద్యులు అరుణ(జనరల్ ఫిజిషియన్), డాక్టర్ నవత(గైనకాలజిస్ట్), న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో బతుకమ్మ సంబరాలు

సిరిసిల్లటౌన్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ ఖ్యాతి పండుగ సంబరాలు ఖండాంతరాల్లో జరిగింది. ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ప్రవాస తెలంగాణ ప్రజలు శనివారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిడ్నీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్ దూపాటి, సభ్యులు సోమ ప్రత్యూష, రాగిపణి పావణి, రాపోలు రాజేశ్, సుతారి శ్రీనివాస్, నర్మెట రాజ్‌కుమార్, బూర్ల సుమన్, ఎర్రం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సహస్రలో జూనియర్ కలాశాలలో..

స్థానిక సహస్ర జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్లు, అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలోని రాచర్ల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జక్కుల చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు



ఎల్లారెడ్డిపేట: దుమాలలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ముస్తాబాద్‌లో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



కోనరావుపేట : మామిడిపల్లిలో ..

వేములవాడఅర్బన్: దేవీ నవరాత్రోత్సవాలను మండలంలో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల కనకదుర్గామాత ఉత్సవ కమిటీ, అల్మాస్‌పూర్ గ్రామంలోని యువసేన యూత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

కోనరావుపేట: మండలం మామిడిపల్లి, కనగర్తి గ్రామాల్లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కుంకుమపూజలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

ముస్తాబాద్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. రామసేన యూత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కుంకుమ పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

సిరిసిల్ల అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్ జీల కిషన్ అన్నారు. శనివారం పెద్దూరు సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలు, ఆదాయ వ్యయాల గురించి సభ్యులతో కలిసి చర్చించారు. ఉపాధ్యక్షుడు బెజ్జారపు నారాయణ, డైరెక్టర్లు మంగ కిరణ్, భూక్య కిషన్‌నాయక్, భాస్కర్, బాలరాజు, భాగయ్య, సీఈవో గౌరి శంకర్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

రబీలో ఎరువుల కొరత లేకుండా చూస్తాం

ఇల్లంతకుంట: రబీలో ఎరువుల కొరత లేకుండా చూస్తామని ఇల్లంతకుంట ప్యాక్స్ పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్ రొడ్ల తిరుపతిరెడ్డి అన్నారు. మండల ప్యాక్స్ సర్వసభ్య సమావేశం శనివారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీకి సంబంధించిన రూ.12 లక్షలు మార్క్‌ఫెడ్‌లో ఉన్నాయన్నారు. ఇల్లంతకుంట ప్యాక్స్ జిల్లాలో లాభాలబాటలో ఉందన్నారు. సొసైటీ పరిధిలోని రైతులకు స్వల్పకాలిక రుణాల కింద రూ.16 కోట్ల 58,29,000, దీర్ఘకాలిక రుణాల కింద రైతులకు రూ.14 కోట్ల 95 లక్షల 55 వేలు ఇచ్చామన్నారు. సొసైటీ పరిధిలోని అనంతారం రోడ్డు పక్కన ఉన్న భూమికి కొలతలు నిర్వహించి ప్రహరీ నిర్మిస్తామన్నారు. సొసైటీలో ఎనిమిదేళ్లుగా దినసరి కూలీలుగా పనిచేస్తున్న ఇద్దరిని ఎందుకు రెగ్యులరైజ్ చేయడం లేదని పెద్ద లింగాపూర్ గ్రామానికి రైతు గన్నారం నర్సయ్య తెలిపారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు చైర్మన్ తిరుపతిరెడ్డి వివరించారు. జిల్లా కోపరేటివ్ రిజిస్ట్రార్ రాములు, కార్యదర్శి చిట్టి రవీందర్ రెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి మెంబర్లు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

ఇల్లంతకుంట: మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలని వైద్యుడు మోహనకృష్ణ అన్నారు. స్వస్త్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గాలిపెల్లి పల్లె దవాఖానలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. పల్లె దవాఖానా డాక్టర్ కట్ట రమేశ్, సంధ్య, నవనీత, సూపర్‌వైజర్ జవహర్, ఏఎన్‌ఎం కవిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ లైట్ల వితరణ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో గ్రామ పంచాయతీకి మాజీ వార్డు సభ్యు డు దాసరి గణేశ్– దాసరి పూర్ణిమ దంపతులు శనివారం సోలార్ ఎల్‌ఈడీ లైట్లు వితరణ చేశారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని లైట్లను పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, జబ్బార్, గోపాల్‌రెడ్డి, లక్కిరెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బదిలీపై బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

- కలెక్టరేట్ వద్ద టపాసులు పేల్చేందుకు యత్నించిన నాయకులు
- అడ్డుకున్న పోలీసులు



కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ నాయకులు టపాసులు కాల్చేందుకు యత్నించగా అడ్డుకుంటున్న పోలీసులు

సిరిసిల్లఅర్బన్: జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బదిలీ అవడంతో బీఆర్ఎస్ నాయకులు శనివారం కలెక్టరేట్ వద్ద టపాసులు కాల్చేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్, పోలీసులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈక్రమంలోనే బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపైనే టపాసులు పెట్టి నిప్పంటించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకుడు అబ్బాడి అనిల్‌రెడ్డి మాట్లాడుతూ అమాయక రైతులు, సామాన్యులపై కలెక్టర్ అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించలేదా, బదిలీపై వెళ్తుంటే టపాసులు కాల్చితే పోలీసులకు ఏమి ఇబ్బంది.. అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీనివాస్, అగ్గి రాములు, బండి దేవదాస్, జిందం దేవదాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట 22 గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులు శనివారం రిలే దీక్షలు చేపట్టారు. కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. పండగకు పస్తులు ఉంచకుండా వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల దీక్షలకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు మద్దతు పలికారు. కార్మికుల దీక్ష శిబిరానికి కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌రెడ్డి చేరుకుని కార్మికులతో చర్చించారు.

తంగళ్లపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులు వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు. గౌరవ అధ్యక్షుడు కోల చంద్రం, రమేశ్, రాములు, వజ్రవ్వ, రేణుక, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలకు చెందిన మొగుళ్ల యశ్వంత్ అనే విద్యార్థి శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. యశ్వంత్ మండలకేంద్రంలో రోడ్డు దాటుతుండగా, బైక్ ఢీకొట్టడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆస్పత్రిలో పరామర్శించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



బోయినపల్లి: దేశాయిపల్లిలో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



చందుర్తి: నివాళి అర్పిస్తున్న నాయకులు, పద్మశాలీ సంఘం సభ్యులు

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, డీవైఎస్‌వో రాందాస్, పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, సంఘం నాయకులు గోనె ఎల్లప్ప, మహేశ్, మాజీ కౌన్సిలర్ రెడ్డినాయక్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలకేంద్రంలోని భక్త మార్కేండేయ ఆలయ ఆవరణలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని మాజీ ఎంపీపీ, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ నాగం కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: దేశాయిపల్లిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. మాడిశెట్టి గంగయ్య, తడుక రమేశ్, తడుక వీరయ్య, మంగళపెల్లి రాజేశం, బత్తిని హరీశ్, బత్తిని అనిల్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం నిర్మిద్దాం

ఎల్లారెడ్డిపేట: టీబీ రహిత సమాజం కోసం కృషిచేయాలని మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్, అశ్విని ఆస్పత్రి ఎండీ డాక్టర్ అభినయ్ అన్నారు. రాచర్లబొప్పాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 60 మంది బాధితులకు అశ్విని ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ జి. సత్యనారాయణస్వామి సమకూర్చిన రూ.36 వేల వ్యయంతో కూడిన నిత్యవసర కిట్లు పంపిణీ చేశారు.

ముస్తాబాద్: టీబీ ముక్త్ భారత్ అందరి లక్ష్యం కావాలని వైద్యాధికారి గీతాంజలి అన్నారు. పోతుగల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గంభీరావుపేటకు చెందిన 60 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఫూడ్ బాస్కెట్ పంపిణీ చేశారు. టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్న ఎల్లారెడ్డిపేట అశ్విని ఆస్పత్రి డాక్టర్ సత్యనారాయణస్వామి ప్రతీనెల రూ.600, సామగ్రి ఇస్తారన్నారు.